క్లుప్తంగా

డీహెచ్‌పీఎస్ జిల్లా కో-కన్వీనర్‌గా మనోహర్



ఎల్కతుర్తి: దళిత హక్కుల పోరాట సమితి హన్మకొండ జిల్లా కో-కన్వీనర్‌గా మండలంలోని గోపాల్‌పూర్‌కు చెందిన నిమ్మల మనోహర్‌ను నియమించినట్లు పోరాట సమితి జిల్లా ఇన్‌చార్జ్ మద్దెల ఎల్లేష్ బుధవారం తెలిపారు. ఈసందర్భంగా మనోహర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన జిల్లా పదవీ బాధ్యతలను వమ్ము చేయకుండా దళిత హక్కుల సాధనకై తనవంతు పోరాటం సాగిస్తానని చెప్పారు. తనకు సహకరించిన సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, నాయకులు కర్రె లక్ష్మణ్, మండల కార్యదర్శి ఉట్కూరి రాములుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్లను తీర్చిదిద్దేందుకు కృషి



ఎల్కతుర్తి : మట్టిరోడ్లు లేని గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీపీ మేకల స్వప్న అన్నారు. మండలంలోని పెంచికలపేటలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ (ఈజీఎస్) నిధుల నుంచి విడుదలైన రూ.30లక్షల వ్యయంతో గ్రామంలో చేపట్టిన సీసీరోడ్ల నిర్మాణం పనులు, రూ.20లక్షల వ్యయంతో చేపట్టిన మెటల్‌రోడ్డు పనులను ఆమె బుధవారం ప్రారంభించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ వర్షాకాలంలో గ్రామ ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం మట్టిరోడ్లు లేని గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తూర్పాటి సునీత, సర్పంచ్ సామెల జమున సురేష్‌రెడ్డి, ఎంపీటీసీ చెవుల కొమురయ్య, వార్డు సభ్యులు, పాల్గొన్నారు.

ఒకరికి గాయాలు

శాయంపేట : రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన మండల కేంద్రంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం. శాయంపేటకు చెందిన చేల్పూరి శ్రీనివాస్ సైకిల్‌పై కిరాణషాపుకు వెళ్తున్న క్రమంలో శాయంపేట నుంచి మాందారిపేట వైపు వెళ్తున్న ద్విచక్రవాహనం బస్టాండ్ సెంటర్‌లో వేగంగా వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో శ్రీనివాస్‌కు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే అతన్ని ఆటోలో హన్మకొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ద్విచక్రవహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

అయ్యప్ప పరపతి సంఘం అధ్యక్షుడిగా భిక్షపతి

శాయంపేట : శాయంపేట గ్రామ అయ్యప్ప పరపతి సంఘం అధ్యక్షుడిగా సామల భిక్షపతిని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. ఉపాధ్యక్షుడిగా దిడ్డి రమేష్, ప్రధాన కార్యదర్శిగా మార్త సుమన్, సలహా కమిటీ సభ్యులుగా పసునూటి భిక్షపతి, సామల రవీందర్, వల పదాసు చంద్రమౌళి, కందకట్ల రమేష్, వనం రమేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నేడు న్యాయవాదుల రిలే నిరాహారదీక్ష

పరకాల: పట్టణంలో సీనియర్ సివిల్ జడ్జి కోర్టును ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం రిలే నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు పరకాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేరుగు శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ డివిజన్ కేంద్రంగా, మున్సిపాలిటీగా కొనసాగుతున్న పట్టణంలో తాము చేసిన ఆందోళన కార్యక్రమాల ఫలితంగా గత ఏడాదినా రాష్ట్ర హైకోర్టు నుంచి ప్రతిపాదనలు వచ్చినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం విచారకరమన్నారు. కక్షిదారుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని సీనియర్ సివిల్ జడ్జి కోర్టును ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

పరామర్శ



నడికూడ: మండలకేంద్రానికి చెందిన యాదెండ్ల పోషమ్మ ఇల్లు ప్రమాదవశాత్తు మంటలు అంటుకోవడంతో స్థానికులు గుర్తించి మంటలు ఆర్పేశారు. ఈ ప్రమాదంలో ఇంటిలోని సామగ్రితో పాటు, పాక్షికంగా ఇల్లు దగ్ధమైంది. సర్పంచ్ ఊర రవీందర్ ఆర్థికసాయం చేసి అధికారుల దృష్టి తీసుకెళ్లి పరిహారం అందేలా చూస్తానని తెలిపారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దూరిశెట్టి చందు, రావుల కిషన్ తదితరులు ఉన్నారు.

వచ్చే ఎన్నికల్లో గుణపాఠం తప్పదు

● మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి



పరకాల : మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భిక్షపతి

పరకాల: ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పటానికి సిద్ధంగా ఉన్నారని బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, బీజేపీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పెసరు విజయచందర్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో బుధవారం పట్టణ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశానికి పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథులుగా భిక్షపతి, విజయచందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కాంట్రాక్ట్ పనులు తప్ప ప్రజల సంక్షేమాన్ని విస్మరించారన్నారు. ట్యాంక్‌బండ్ నిర్మాణం, ఆర్టీసీ డిపోకు పూర్వవైభవం తీసుకురాని పక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నెల 10 నుంచి నిర్వహించనున్న శక్తి కేంద్రం కార్నర్ సమావేశాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుజ్జ సత్యనారాయణరావు, కాచం గురుప్రసాద్, రాష్ట్ర నాయకులు మేకల రాజవీర్, దేవునూరి మేఘనాథ్, కౌన్సిలర్లు కొలనుపాక భద్రయ్య, బెజ్జంకి పూర్ణాచారి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజభద్రయ్య, పట్టణ నాయకులు దుబాసి వెంకటస్వామి, నిరంజన్, పురుషోత్తం పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి



శాయంపేట : మాట్లాడుతున్న మొగిళి

శాయంపేట : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ గ్రామస్థాయిలో బీజేపీని అభివృద్ధి చేసేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాయరాకుల మొగిలి అన్నారు. బుధవారం మండలంలోని తహారాపూర్‌లో మండల స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజలకు వివరించాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేస్తున వైఫల్యాలను ఈనెల 10 నుంచి 25 వరకు శక్తి కేంద్రం కార్నర్ మీటింగ్‌ల్లోని ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు మోత్కూరి సత్యనారాయణ, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి ఉప్పు రాజు, జిల్లా మాజీ అధ్యక్షుడు తాటికొండ రవికిరణ్,రామకృష్ణారెడ్డి, మురళి, రవి, మహేష్, రాకేష్‌రెడ్డి, మల్లారెడ్డి, పాల్గొన్నారు.

బీఆర్ఎస్ తగిన మూల్యం చెల్లించక తప్పదు

కమలాపూర్: అధికార పార్టీ దుర్మార్గపు చర్యలను ప్రజలు గమనిస్తున్నారని రానున్న రోజుల్లో బీఆర్ఎస్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని బీజేపీ మండల అధ్యక్షుడు కట్కూరి అశోక్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ కాన్వాయ్‌ని అడ్డుకుని దాడులకు పాల్పడ్డ బీఆర్ఎస్ గూండాలను వదిలిపెట్టిన పోలీసులు బీజేపీ కార్యకర్తలపై ఐపీసీ 323, 326, 506, ఆర్/డబ్ల్యూ 149 సెక్షన్ల కింద నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనకు సంబంధించి ఆరుగురు బీజేపీ కార్యకర్తలను హనుమకొండ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని తమ కార్యాలయానికి తీసుకెళ్లి తీవ్ర ఇబ్బందులకు గురి చేయడంతో పాటు ఇష్టం వచ్చినట్లు కొట్టి చిత్రహింసలకు గురి చేశారని ఆరోపించారు. పోలీసులు అధికార పార్టీకి తొత్తులుగా మారి ఇలా వ్యవహరించడం ప్రజాస్వామ్యానికి సిగ్గు చేటన్నారు. బీజేపీ కార్యకర్తలకు కేసులు కొత్త కాదని, తమపై కేసులు పెట్టి జైళ్లకు పంపిస్తే జైళ్లు కూడా సరిపోవన్నారు. ఇలాంటి ఘటనలు మరోసారి పునరావృతమైతే తగిన రీతిలో బుద్ధి చెప్పడానికి బీజేపీ కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని ఆయన హెచ్చరించారు.

విద్యారంగ బడ్జెట్‌పై ఎస్ఎఫ్ఐ నిరసన



పరకాల: కళాశాల ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పరకాల: విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మొండిచేయి చూపించడం విడ్డూరంగా ఉందని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్ అన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కావాల్సిన నిధులు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కళ్యాణ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించి పేద విద్యార్థులకు అందని ద్రాక్షలా మారుస్తున్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం రూ.45,03,097 లక్ష కోట్ల బడ్జెట్‌లో విద్యారంగానికి రూ.1.12 లక్ష కోట్లు మాత్రమే కేటాయించగా మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపె ట్టిన రూ.2.90 లక్ష కోట్ల బడ్జెట్‌లో విద్యారంగానికి రూ.19000 కోట్లను మాత్రమే కేటాయించడం అన్యాయమన్నారు. విద్యారంగాన్ని సమస్యల వలయంలోకి నెట్టాలని చూస్తే పోరాటాలను ముమ్మరం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మడికొండ ప్రశాంత్, పట్టణ అధ్యక్షుడు బొచ్చు ఈశ్వర్, శివ వంశీ, మహేశ్, రాజేష్, శాంతి కుమార్ పాల్గొన్నారు.

నిరుద్యోగులకు మొండిచేయి

శాయంపేట : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో నిరుద్యోగులకు మొండిచేయి చూపిందని డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మంద సురేష్ అన్నారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీలు ఇచ్చిందన్నారు. ఇప్పటి వరకు ఆ హామీని నెరవేర్చకుండా కాలయాపన చేస్తుందన్నారు. ఎస్సీ కార్పొరేషన్ విషయంలో, డబుల్ బెడ్రూం ఇళ్లు, రుణాలు మంజూరు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో యువతే తగిన బుద్ధి ప్రభుత్వానికి సరైన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

'కంటి వెలుగు'లో ప్రజలు భాగస్వాములు కావాలి



శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు

దామెర: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని పసరగొండలో కంటివెలుగు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ కంటి సమస్యల పరిష్కారానికి ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని వెల్లడించారు. మండల వైద్యాధికారి డాక్టర్ మంజుల మాట్లాడుతూ గ్రామంలో తొమ్మిది రోజుల పాటు ఈ శిబిరం కొనసాగుతుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ కంటిపరీక్షలు చేయించుకొని వైద్యుల సలహాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ మేడిపల్లి సాంబయ్య, ఎంపీటీసీ శనిగరం కళాసుధాకర్, ఉపసర్పంచ్ మధు, పంచాయతీ కార్యదర్శి అమిత, హెచ్ఈఓ సలోమి, పీహెచ్ఎన్ అశోక్‌బాబు, సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మీ, ఏఎన్ఎం అమృత, తదితరులు పాల్గొన్నారు.

పోయిన డబ్బులు దొరికాయి

● ఊపిరి పీల్చుకున్న రిటైర్డ్ ఉద్యోగి



డబ్బును కొమురయ్యకు అందజేస్తున్న పోలీసులు

పరకాల : బ్యాంక్ నుంచి డబ్బు విత్‌డ్రా చేసుకొని వెళ్తున్న ఓ రిటైర్డ్ ఉద్యోగి మార్గమధ్యలో పోగొట్టుకొని లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించాడు. సీసీ పుటేజీతో స్థానిక పోలీసులు పోయిన డబ్బును దొరకబెట్టి స్థానికుల ప్రశంసలు అందుకున్నారు. పట్టణంలోని సీఎస్ఐ కాలనీకి చెందిన రిటైర్డు ఉద్యోగి బండి కొమురయ్య బుధవారం ఎస్‌బీఐకి చేరుకొని రూ.85వేలు విత్ డ్రా చేసుకున్నాడు. ఆటో దిగి కొద్ది దూరం వెళ్లిన తర్వాత డబ్బులు లేకపోవడంతో ఒక్కసారిగా షాక్‌కు గురయ్యాడు. వెంటనే పరకాల పోలీసులను ఆశ్రయించగా సీఐ కిషన్ ఆదేశాల మేరకు పోలీసులు సీసీ పుటేజీతో కొమురయ్య ప్రయాణించిన ఆటోను గుర్తించి డబ్బును స్వాధీనం చేసుకున్నారు. పోయిన డబ్బులను అప్పగించడంతో కొమురయ్య పోలీసులకు కృతజ్ఞతలు తెలిపాడు.

హైదరాబాద్‌కు తరలిన వంట కార్మికులు



ధర్నాకు వెళ్తున్న వంట కార్మికులు

కమలాపూర్ : తమ సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో తలపెట్టిన ధర్నా కార్యక్రమంలో పాల్గొనేందుకు మండలానికి చెందిన సుమారు 40 మంది మధ్యాహ్న భోజన పథకం వంట కార్మికులు బుధవారం హైదరాబాద్‌కు తరలివెళ్లారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జక్కు రాజుగౌడ్, తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ధర్మల రామ్మూర్తి జెండా ఊపి వాహనాల ద్వారా హైదరాబాద్‌కు పంపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వంట కార్మికులకు పెంచిన రూ.3 వేల వేతనానికి సంబంధించి జీఓ విడుదల చేసి తక్షణమే చెల్లించాలని, విద్యార్థులకు అందించే కోడిగుడ్లనుప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకుడు కొలుగూరి బాలరాజు, వంట కార్మికులు పాల్గొన్నారు.

ప్రత్యేక నిధులు కేటాయించాలి



భీమదేవరపల్లి: మండలంలో అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను కలిసినట్లు జెడ్పీటీసీ వంగ రవి తెలిపారు. ఈ మేరకు నూతన కలెక్టర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం జెడ్పీటీసీ కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

తాపీమేస్త్రీకి తీవ్రగాయాలు

ఆత్మకూరు: విద్యుత్ తీగలు తగిలి విద్యుదాఘాతంతో ఓ తాపీమేస్త్రీకి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని అక్కంపేటలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. హనుమకొండ యాదవనగర్‌కు చెందిన తాడిచెట్టి సందీప్ అక్కంపేటలోని కక్కెర్ల పున్నంచందర్ ఇంటి నిర్మాణ పనులు చేస్తుండగా ఇంటిపక్కన ఉన్న 11కేవీ విద్యుత్‌తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురి కాగా తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం సనందీప్‌ను హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు.

అపరిచితులతో చాటింగ్ చేయొద్దు

హసన్‌పర్తి: అపరిచిత వ్యక్తులతో చాటింగ్ చేయొద్దని ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సమితి మండల కోఆర్డినేటర్ సుదర్శన్ సూచించారు. మానవ, బాలల అక్రమ రవాణాను అరికట్టడం అనే అంశంపై మండలంలోని దేవన్నపేట జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టడానికి, బాలకార్మిక వ్యవస్థను రూపుమాపడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని పేర్కొన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని సూచించారు.

ఓటర్, ఆధార్ అనుసంధానం త్వరగా పూర్తి చేయాలి

హన్మకొండ అర్బన్: ఓటరు గుర్తింపుకార్డుకు ఆధార్ అనుసంధానం ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని బూత్ స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లను ఇన్‌చార్జ్ జిల్లా అదనపు కలెక్టర్, డీఆర్ఓ వాసుచంద్ర ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో హనుమకొండ జిల్లాలోని వరంగల్ పశ్చిమ నియోజకవర్గం–105కు సంబంధించిన ఓటర్ల ఓటరు గుర్తింపు కార్డుకు ఆధార్ అనుసంధానం నమోదు ప్రక్రియపై బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు గుర్తింపు కార్డుకు ఆధార్ అనుసంధానం, ఫొటో సిమిలారిటీ ఎంట్రీ, పూర్ క్వాలిటీ ఫొటోలను గుర్తించడం ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

సేవ చేయడమే అభిమతం కావాలి

హన్మకొండ కల్చరల్: సేవ చేయడమే ప్రతీఒక్కరి అభిమతం కావాలని పూర్వ మల్టీపుల్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ వంగాల గోపాల్‌రెడ్డి సూచించారు. హనుమకొండ చింతగట్టులోని ఎస్‌పీఆర్ గార్డెన్స్‌లో దొమ్మాటి వెంకటస్వామి అధ్యక్షతన సదాశ్రీ లయన్స్ ప్రాంతీయ సదస్సు మంగళవారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా రీజియన్ ఆఫ్ ది లయన్‌గా నరహరి సుధాకర్‌రెడ్డికి అవార్డు ప్రదానం చేశారు. పూర్వ జిల్లా గవర్నర్ పింగిలి సంపత్‌రెడ్డి ఆధ్వర్యంలో రూ.3 లక్షల విలువగల ఎనిమిది కుట్టుమిషన్లు, చీరలు, విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, డిక్షనరీలు, దుప్పట్లను పంపిణీ చేశారు. ఉప జిల్లా గవర్నర్ కుందూరు వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా జరుగుతున్న వ్యర్థాల సేకరణలో ప్రతిసభ్యుడు భాగస్వామి కావాలని కోరారు. నాట్యమయూరి నృత్యకళాక్షేత్రం నిర్వాహకులు కుండె అరుణ శిష్యబృందం శాస్త్రీయ నృత్యాలు అలరించాయి. జోనల్ చైర్మన్లు నరేందర్, డాక్టర్ రాజిరెడ్డి.. నివేదికలు సమర్పించారు. మాస్టర్ ఆఫ్ సెర్మోనిగా పెండం వేణుమాధవ్ వ్యవహరించారు.

భూమి పూజకు తరలిరావాలి



కమలాపూర్ : కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు



ఆత్మకూరు: ఆహ్వానపత్రాలతో నాయకులు

కమలాపూర్: ఈ నెల 15న హైదరాబాద్‌లోని ఉప్పల్ భగాయత్‌లో జరిగే ఆరె కుల ఆత్మగౌరవ భవన నిర్మాణ భూమి పూజకు ఆరె కులస్తులు ఇంటికొకరు తరలిరావాలని హనుమకొండ జిల్లా ఇన్‌చార్జీలు దుమాల సుధాకర్, పేర్వాల లింగమూర్తి పిలుపునిచ్చారు. మండలంలోని గోపాల్‌పూర్, గుంటూర్‌పల్లి, శనిగరం, లక్ష్మీపూర్, నేరెళ్ల, శంభునిపల్లి, దేశరాజుపల్లి, ఉప్పులపల్లి, కొత్తపల్లి, గుండేడు, పంగిడిపల్లి, మర్రిపల్లిగూడెం, జూజునూర్‌పల్లి గ్రామాల్లో బుధవారం వారు పర్యటించి ఆరె కులస్తులను సమాయత్తపరిచి ఆరె కుల సంఘ భవన నిర్మాణ పనులకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమాల్లో జిల్లా కమిటీ సభ్యులు కొల్లూరి కండెరావు, వాడికారి నరహరి, తుమ్మనపల్లి రాజు, సిందె చందర్‌రావు, విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మోటి చిరంజీవి, మండల గౌరవ అధ్యక్షుడు లడె గోపాల్‌రావు, ప్రధాన కార్యదర్శి బాసిరి కృష్ణ, లడె శివాజీ, సదాశివరావు, భావని రాజేశ్వర్‌రావు, వివిధ గ్రామ కమిటీల బాధ్యులు, కుల బాంధవులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : ఆరె సంక్షేమ సంఘం భవనం భూమి పూజకు తరలిరావాలని సంఘం ఆత్మకూరు, దామెర మండలాల అధ్యక్ష, కార్యదర్శులు గువ్వాటి సాంబయ్య, లకిడే హరీష్‌రావు, హింగే బాబురావు, ప్రేమ్‌రావు పిలుపునిచ్చారు. ఆత్మకూరు, దామెర మండలాల్లో జరిగిన సమావేశాల్లో వారు మాట్లాడుతూ ఈనెల 15న హైదరాబాద్‌లోని ఉప్పల్ భాగాయత్‌లో సంఘం భవనం భూమి పూజ జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి కులస్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

ఎమ్మెల్యే 'చల్లా' చొరవతో గ్రామాల అభివృద్ధి



సీసీ రోడ్డు శంకుస్థాపనలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

దామెర: పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి చొరవతో మండలం అభివృద్ధిలో దూసుకుపోతుందని ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గండు రాము అన్నారు. బుధవారం మండలంలోని తక్కళ్లపహాడ్‌లో రూ.40 లక్షల వ్యయంతో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో నూతన మండలంగా ఏర్పడిన దామెరను ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో దళితబంధు చైర్మన్ గరిగె క్రిష్ణమూర్తి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు గట్ల విష్ణువర్ధన్ రెడ్డి, వైస్ ఎంపీపీ జాకీర్, సర్పంచ్‌లు బింగి రాజేందర్, వడ్డెపల్లి శ్రీనివాస్, నాయకులు జన్ను మల్లయ్య, దాడి మల్లయ్య, రమేష్ యాదవ్, సార కిషన్, దాడి రమేష్, గణేష్, కోఠి, రాజ్‌కుమార్ రవి, పాల్గొన్నారు.

సాగుపై విద్యార్థులకు అవగాహన



మిర్చి పంటను సందర్శిస్తున్న విద్యార్థులు

ఎల్కతుర్తి: సస్య భారత్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఇందిరానగర్‌లోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులకు వ్యవసాయం సాగుపై పాఠశాల ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్ బుధవారం అవగాహన కల్పించారు. మండలంలోని గోపాల్‌పూర్‌లో రైతులు పండించే వరి, మిర్చి, మొక్కజొన్న, వివిధ రకాల అంతరపంటలను విద్యార్థులు సందర్శించి పరిశీలించారు. విద్యార్థులు అక్కడి రైతులతో మాట్లాడి పంటల రకాలు, నేలల స్వభావాలు, రసాయన ఎరువుల వాడకం, సేంద్రియ ఎరువుల ప్రాధాన్యత, పంటలకు సోకే తెగుళ్లు, పిచికారి చేసే మందులు, కలుపు యాజమాన్య పద్ధతులు, నీటి వినియోగంపై రైతుల ద్వారా వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు దేశానికి అన్నపెట్టే రైతుల గురించి, వారు చేసే వ్యవసాయ వృత్తిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ శ్రీధర్, శ్రీవిద్య, లక్ష్మణ్‌రావు, రాజు, నాయుడు, సుమన్, అన్వేష్, ఉపాధ్యాయులు, విద్యార్థినీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో పురుగులు



ముక్కిపోయిన బియ్యం పరిశీలిస్తున్న దేవేందర్

నడికూడ: మండలంలోని నర్సక్కపల్లె ప్రాథమిక పాఠశాలను విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్ సందర్శించారు. మధ్యాహ్నం భోజన బియ్యాన్ని పరిశీలించగా పురుగులు పట్టి, ముక్కిపోయి ఉండటాన్ని గమనించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యంతో విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నాణ్యమైన బియ్యం అందించాలని డిమాండ్ చేశారు. తల్లిదండ్రులు, కాంగ్రెస్ నాయకులు, ఉన్నారు.

జాతీయ గణిత దినోత్సవం



బహుమతులు ప్రదానం చేస్తున్న ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రాజయ్య

పరకాల: హన్మకొండ రీజినల్ సైన్స్ సెంటర్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాలలో బుధవారం జాతీయ గణిత దినోత్సవ సంబురాలు నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాసం, క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు కె.రాజయ్య బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రీజినల్ సైన్స్ సెంటర్ నిర్వాహకులు కుమారస్వామి, రాజయ్య, ఉపాధ్యాయులు శ్రీలత, దావూద్, శంకర్, శశికళాధర్, స్వప్న పాల్గొన్నారు.